
సాక్షి కామారెడ్డి

శనివారం । 7 । డిసెంబర్ । 2024



పర్యాటక శోభ

పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి సర్కారు కసరత్తు చేస్తోంది. మంత్రి జూపల్లి సందర్శించనున్నారు.

- 8లో ▸



అంబేడ్కర్ అడుగుజాడల్లో..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నారని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

36.5 /19.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

జనం కోసమే తపన

- నియోజకవర్గ ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే
- అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యత
- పనులు నిరాటంకంగా జరిగేలా చూడాలని సీఎంను కోరా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''బాన్సువాడ నియోజకవర్గం నా కుటుంబం.. ప్రజలకు మేలు చేయాలన్నదే నా ఆశయం.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం జనం మధ్యే ఉండడం నాకు అలవాటు. 1994లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన నాటి నుంచి ఇప్పటి దాకా ప్రతి రోజూ ప్రజల కోసమే పనిచేస్తున్నా. భవిష్యత్తులోనూ ప్రజలతోనే ఉంటా''నని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదైన సందర్భంగా శుక్రవారం 'సాక్షి' ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

పురోగతిలో పనులు..

రూ.258 కోట్లతో మొదలుపెట్టిన సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి. రూ.150 కోట్లతో చేపట్టిన జాకోరా, చందూర్, చింతకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులూ పురోగతిలో ఉన్నాయి. బీర్కూర్ వద్ద రూ.40 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం పనులు సాగుతున్నాయి. నిజాంసాగర్ కెనాల్ లైనింగ్ పనులు పూర్తికావచ్చాయి. కొడిచర్లలో రూ.18 కోట్లతో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతోంది. రూ.70 కోట్లతో పాతంగల్‌లో చేపట్టిన లిఫ్ట్ పనులు పూర్తి కావస్తున్నాయి.

సీఎం సహకారం..

నియోజక వర్గంలో ప్రోగ్రెస్‌లో ఉన్న పనులు ఏవీ ఆగకుండా చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించా. మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి సహకరించాలని కోరా. ఆయన నా అభిప్రాయాలను గౌరవించి సహకరిస్తున్నారు.

విద్యాభివృద్ధి కోసం..

స్థానికంగా బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులు అందుబాటులో ఉంటే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. అందుకే బాన్సువాడకు అగ్రికల్చర్ బీఎస్సీ కాలేజీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నా. కోనాపూర్‌లో రూ.12 కోట్లతో చేపట్టిన ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణ పనులు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. నస్రుల్లాబాద్‌లో రూ.12 కోట్లతో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల భవనం నిర్మించేందుకు టెండర్లు పూర్తయ్యాయి.



సాక్షి ఇంటర్వ్యూ

డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు..

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి రూ.15 కోట్లు.. కొత్త ప్రభుత్వంలో తీసుకుని లబ్ధిదారులకు చెక్కులు అందించాం. మరో రూ.15 కోట్లు రావాల్సి ఉంది. అవి కూడా త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నా. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. పేదల వివరాలను అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరవుతాయి. ఇప్పటివరకు రాష్ట్రంలోనే అత్యధికంగా 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను బాన్సువాడ నియోజకవర్గంలో నిర్మించాను.

నియోజకవర్గం కోసం నిరంతరం శ్రమిస్తున్నా

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నా. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రగతి సాధించానంటే దాని వెనక నా కఠోర శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. నేను పెళ్లికి వెళ్లినా.. ఇతర ఫంక్షన్లకు వెళ్లినా ప్రజలతో మాట్లాడుతా. వారు ఏదైనా సమస్య చెబితే అక్కడికి వెళ్లి చూస్తా. రెగ్యులర్‌గా హాస్టళ్లు, గురుకులాలు, ఆస్పత్రులకు వెళ్లి పరిశీలిస్తా. దీంతో పెద్ద సార్ ఎప్పుడొస్తడో అన్న భయం అక్కడి అధికారులు, ఉద్యోగుల్లో కనిపిస్తుంది. ఎలక్షన్లకు, ఓట్లకు సంబంధం లేకుండా నిరంతరం అభివృద్ధి, సంక్షేమం కోసమే కష్టపడుతున్నా. అందుకే నియోజకవర్గ ప్రజలు ప్రతిసారి ఆశీర్వదిస్తున్నారు.

రోడ్లకు నిధులు..

పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్‌ఆర్ నిధులు రూ.20 కోట్లతో మంజూరైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. సీఆర్‌ఆర్ నిధులు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. 23 పనులకు సంబంధించి టెండర్లు జరిగి పనులు ప్రారంభం కానున్నాయి. ఈజీఎస్ కింద రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, జీపీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మిస్తున్నాం. ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లతో వివిధ మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లు మిగిలిపోయిన వైడెనింగ్ పనులకు రూ.140 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చాను. ఆ నిధులు మంజూరైతే రోడ్ల సమస్య తీరిపోతుంది. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ జాతీయ రహదారికి రూ.9 వందల కోట్లతో పనులు మొదలయ్యాయి.

ఎన్ని నిధులైనా తీసుకువస్తా

సర్కారు దవాఖానాల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడేందుకు చర్యలు తీసుకుంటున్నా. వర్ని మండలంలో రూ. 11 కోట్లతో చేపట్టిన 30 పడకల ఆస్పత్రి నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. కోటగిరి మండలంలో రూ.13 కోట్లతో చేపట్టిన 50 పడకల ఆస్పత్రి పనులు జరుగుతున్నాయి. బాన్సువాడలో రూ.37.50 కోట్లతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి పునర్నిర్మాణ పనులు నడుస్తున్నాయి. పల్లె దవాఖానాల పనులు పురోగతిలో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే తపనతో ఇవన్నీ చేయిస్తున్నా. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు, ప్రైవేటుకు వెళ్లే పరిస్థితి లేకుండా చూసేందుకు ఎన్ని నిధులైనా తీసుకువస్తా.

చరిత్రాత్మక నిర్ణయాలు..

రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేసింది. అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. రైతుభరోసా దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో మంత్రులతో సబ్‌కమిటీ వేశారు. యాసంగి పంట నుంచి రైతుభరోసా అందనుంది. అలాగే సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడంతో రైతులు సంతోషంతో ఉన్నారు. బాన్సువాడలో కొందరు రైతులు వ్యాపారస్తులకు అమ్ముకున్నారు. అయినా అన్ని రకాల వడ్లు కలిపి లక్ష మెట్రిక్ టన్నులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చాయి. రెండో పంట యాసంగికి రైతులు నారుమడులు పోశారు. రైతులు అడగగానే నీళ్లు ఇవ్వడానికి రెడీగా ఉన్నాం. రాష్ట్ర స్థాయిలోనూ నీటి విడుదలకు నిర్ణయం జరిగిపోయింది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రాజెక్టుల నీటిని విడుదల చేస్తాం.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

నిజాంసాగర్/నాగిరెడ్డిపేట: పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మద్నూర్ మండలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారని, ఏఎంసీ పాలకవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కౌలాస్, నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టుల తోపాటు లింగంపేట మండలంలోని నాగన్నగారి బావి, నాగిరెడ్డిపేట మండలం తాండూరు శివారులోని త్రిలింగ రామేశ్వరాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

'పోచారం'ను పరిశీలించిన ఇరిగేషన్ డీఈఈ



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టును శుక్రవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు సందర్శించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం నాగిరెడ్డిపేట మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఇరిగేషన్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రాజెక్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. ఆయనవెంట ఇరిగేషన్ ఏఈ అక్షయ్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



నిజాంసాగర్/భిక్కనూరు: విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్య కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న సూచించారు. శుక్రవారం ఆమె నిజాంసాగర్ మండలంలోని కేజీబీవీ, భిక్కనూరు మండలం బస్వాపూర్‌లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంతోపాటు కూరగాయాలు ఇతర సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, నిజాంసాగర్ ఎంఈవో తిరుపతిరెడ్డి, భిక్కనూరు ఎంఈవో రాజగంగారెడ్డి, హెచ్‌ఎం జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం



రాజంపేట: మండలంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. తలమడ్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తడిసింది. కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

టీజీవో జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్



కామారెడ్డి రూరల్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్ ఎన్నికయ్యారు. ఆయన భిక్కనూరు మండల పశువైద్యాధికారిగా పనిచేస్తున్నారు. టీజీవోస్ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికవడం వరుసగా ఇది మూడోసారి. ఆయనను సంఘ సభ్యులు అభినందించారు.

ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఎల్లారెడ్డి: ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్ నోడల్ ఆఫీసర్ సలాం సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలలోని రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదివి మంచి ర్యాంకులను సాధించాలని అన్నారు. స్టడీ అవర్స్‌కు విద్యార్థులు రావాలని అన్నారు. ప్రిన్సిపల్ నిజాం తదితరులున్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: ఎలాంటి తప్పులు లేకుండా తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కామారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తుది ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సిద్ధం చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించడంతోపాటు మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే నమోదు చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

తుది ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించడానికి అన్ని జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేస్తామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కామారెడ్డి ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, మన్నె ప్రభాకర్, తహసీల్దార్‌లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్‌ఫెయిర్

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ ప్రారంభం



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్‌లకు జ్ఞాపికలు అందిస్తున్న విద్యాధికారులు

బాన్సువాడ: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్‌ను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో వైజ్ఞానిక ఆలోచన శక్తిని పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు సైంటిస్టులు కావాలని ఆకాంక్షించారు.

600 లకుపైగా ప్రాజెక్టులు...

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్‌లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 600 లకుపైగా ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులోంచి 23 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్‌కు పంపిస్తామని జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి తెలిపారు. గతంలో 78 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని, దీంతో విద్యార్థుల ఖాతాలలో రూ. 10 వేల చొప్పున మొత్తం రూ.7.80 లక్షలు జమ అయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, డీఈవో రాజు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, తపస్ జిల్లా కార్యదర్శి భూనేకర్ సంతోష్, టీపీటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్ల అరుణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాల్‌రాజ్, శ్రీనివాస్, నరహరి, నర్వ శ్రీనివాస్, అయ్యాల సంతోష్, ప్రవీణ్, దాసరి రవీందర్, హన్మండ్లు, నాగభూషణం, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం

- ఎవరు అడ్డుపడ్డా కామారెడ్డిలో అభివృద్ధి ఆగదు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, అన్నింటిని నెరవేస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయమై సీఎంతో చర్చించానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి అభివృద్ధికి రూ.27 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందిరా గాంధీ స్టేడియం ఆధునీకీకరణ కోసం అదనంగా రూ. 8 కోట్లు మంజూరు చేయించానన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం 4.50 కోట్ల నిధులు వచ్చాయన్నారు. తాను మాటలతో అభివృద్ధి చేయనని, చేతలతో చేసి చూపెడతానని పేర్కొన్నారు. తన కృషితో మంజూరైన నిధులను కొందరు వారే మంజూరు చేయించినట్లుగా చెప్పుకుంటున్నారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

బీజేపీకి చేతకాదు..

ప్రధాని నరేంద్ర మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఎన్ని ఇచ్చారని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. ఇతర దేశాలలోని బ్లాక్ మనీని తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల నల్లధనాన్ని వేస్తానని చెప్పి ఎన్ని ఏళ్లవుతుందో ప్రజలు గ్రహించాలన్నారు. చెప్పడమే తప్ప చేయడం బీజేపీకి చేతకాదన్నారు. రైతులకు రుణమాఫీ కాలేదంటూ బీఆర్ఎస్ గగ్గోలు పెడుతోందని పేర్కొన్నారు. కానీ వారు అధికారంలో ఉన్న పదేళ్లలో రుణమాఫీ ఎంత చేశారో చెప్పాలన్నారు. తాము రైతులకు సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంటరుణాలను మాఫీ చేశామన్నారు. మిగతా రైతులకూ త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. సంక్రాంతికి రైతు భరోసా కూడా ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించిందని, అందులోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు నిమ్మ మోహన్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, పండ్ల రాజు, కారంగుల అశోక్‌రెడ్డి, ఐరేని సందీప్, మామిండ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

- లేకపోతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల కోసం అవసరమైతే నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్దెర మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి.. ఏడాది పాలనలో అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. రైతులు, విద్యార్థులు, జర్నలిస్టులు, మహిళలనే కాదు చివరికి ఉద్యోగస్తులను కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఏళ్ల తరబడి ప్రజా సేవ చేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు కూడా ప్రభుత్వం బెనిఫిట్స్ బకాయి పడిందన్నారు. పోలీసులకు రెండుమూడేళ్లుగా డీఏలు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఒక్కో పోలీసుకు రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు రూ.4 వేల కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 2 వేల కోట్ల వరకు బకాయి పడిందన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై చర్చ జరిపితే రూ.150 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అవి ఎక్కడికి పోయాయో తెలియదన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా పోలీసులు, ఉద్యోగుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, నాయకులు భరత్, నరేందర్, శ్రీనివాస్, నాయకులు వేణు, సంధ్య, యాదమ్మ, హారిక, రవీందర్, భూపాల్‌రెడ్డి, శ్రీధర్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ నేతలు

క్లుప్తంగా

పేస్కేల్ అమలు చేయాలి



కామారెడ్డి క్రైం: తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 9 వరకు రిలే నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

బాన్సువాడ రూరల్: సమగ్రశిక్ష, కేజీబీవీ పాఠశాలల్లో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని తపస్ కామారెడ్డి ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తాబాది కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తపస్ జిల్లా అధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు'



భిక్కనూరు: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి కృషి చేస్తున్నారని బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ కల్యాణ మండపంలో గతంలో కేవీఆర్ ఇచ్చిన హామీ మేరకు జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి కోసం కేవీఆర్ ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. ముదిరాజు సంఘం మండలాధ్యక్షుడు బండి రాములు, బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పరి రాములు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను శుక్రవారం మాచారెడ్డి ఎస్సై అనిల్ బాధితునికి అందజేశారు. పాల్వంచ మండలం ఇసాయిపేటకు చెందిన గుంటి రాజు సెల్ ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

క్రికెట్ పోటీలకు ఎంపిక



రాజంపేట: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నిజామాబాద్ జిల్లా తరపున రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఆముద మణికంఠ ఎంపికై నట్లు మణికంఠ కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు ఆముద సౌమ్య, నాగరాజులు సంతోషం వ్యక్తం చేశారు. మణికంఠ ప్రసుత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.


జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి మహేష్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 8 నుంచి 12 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ఆయన తెలిపారు. మహేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

పోచారం ప్రాజెక్టుకు పర్యాటక శోభ

- ఆహ్లాదకర వాతావరణంలో పోచారం ప్రాజెక్టు
- అభయారణ్యంలో సందడి చేస్తున్న వన్యప్రాణులు
- టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చేయాలని కోరుతున్న స్థానికులు
- నేడు సందర్శించనున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పోచారం ప్రాజెక్టు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు వద్ద టూరిజం స్పాట్ ఏర్పాటుపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రాజెక్టులో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఇటీవల ప్రాజెక్టును సందర్శించి టూరిజం స్పాట్ ఏర్పాటు కోసం స్థలాన్ని సైతం పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పోచారం ప్రాజెక్టుకు త్వరలోనే పర్యాటకశాఖ మంత్రిని తీసుకువచ్చి పర్యాటక అభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా తాండూర్ గ్రామ శివారులో గల త్రిలింగ రామేశ్వరాలయంతోపాటు పోచారం ప్రాజెక్టును శనివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించనున్నారు. మండలంలోని త్రిలింగ రామేశ్వరాలయంతోపాటు పోచారం ప్రాజెక్టును మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటనపైనే మండల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ఆహ్లాదకరంగా ప్రాజెక్టు పరిసరాలు..

మండలంలోని ఆలేరు వాగుపై నిజాంకాలంలో అప్పటి ప్రభువు పోచారం ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు దిగువభాగన 58 కిలోమీటర్ల పొడవుతో ప్రధానకాలువను నిర్మించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్న దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి. ప్రాజెక్టు అలుగుపారే అందాలను చూసేందుకు వందల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తారు. ప్రాజెక్టు సమీపంలో ఉన్న అభయారణ్యం అందాలు సైతం పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఈ అభయారణ్యంలో జింకలు, నెమళ్లు, సంబార్‌లు, నీల్‌గాయ్‌లు, కుందేళ్లు, కొండగొర్రెలు, మనుబోతులు వంటి ప్రాణులు తిరుగుతూ ఆహ్లాదాన్ని పంచుతాయి. ఆదివారంతోపాటు ఇతర సెలవుదినాలలో హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి తరలివస్తారు.

గతంలో బోటింగ్ సదుపాయం...

ఏడేళ్లక్రితం పోచారం ప్రాజెక్టులో అప్పటి మెదక్ కలెక్టర్ చొరవతో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు మధ్యలో ఉన్న ఐలాండ్ చుట్టూ బోటింగ్ చేసే అవకాశం ఉండేది. కొన్నాళ్ల తర్వాత బోటింగ్ సదుపాయాన్ని నిలిపేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో మళ్లీ బోటింగ్ సదుపాయం కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద నిజాంకాలంలో నిర్మించిన రెండు భారీ అతిథిగృహాలకు మరమ్మతులు చేపట్టి వాటిని వినియోగంలోకి తీసుకువస్తే పర్యాటకులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతోపాటు ప్రాజెక్టు వద్ద తాగునీటి సదుపాయం, బాత్‌రూం, టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

మహిమాన్విత ఆలయం.. త్రిలింగ రామేశ్వరాలయం

వెయ్యేళ్ల చరిత్ర కలిగి ఎంతో మహిమాన్విత ఆలయంగా పేరుగాంచిన నాగిరెడ్డిపేట మండలంలోని త్రిలింగ రామేశ్వరాలయాన్ని సైతం అభివృద్ధి చేయాల్సి ఉంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సూర్యకిరణాలు త్రిలింగేశ్వరాలయంలోని శివలింగంపై పడటం ఇక్కడి ప్రత్యేకత. కాకతీయుల కాలంనాటి ఆలయం పైకప్పు నుంచి వర్షపునీరు లీకేజీ అవుతుంది. దీంతోపాటు ఆలయ గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆలయ పైకప్పునకు, గోడలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే ఆలయం చుట్టూ ప్రాకారమండపం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. ఏదేమైనా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం, త్రిలింగ రామేశ్వరాలయాలను కలిపి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వెయ్యేళ్ల చరిత్ర కలిగిన తాండూర్‌లోని త్రిలింగ రామేశ్వరాలయం

విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

పిట్లం(జుక్కల్): విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వస్తున్నాయని, సమాజంలో అవహేళనకు గురవుతున్నామని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని, భవిష్యత్తులో చాలారకాల అవకాశాలు ఉంటాయని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రమణ పాల్గొని మాట్లాడారు. అంతేకాకుండా ఈ వయసులో మత్తు పదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదని, మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించాలన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పిన మాటలను వినాలని సూచించారు. అలాగే ఎవరికైనా మానసిక ఆందోళనకు గురైతే నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 14416కి కాల్ చేయాలన్నారు. వైద్యులు రోహిత్, సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్, అధ్యాపకులు నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జి.రమణ

రైతు భరోసా ఇవ్వాలి

మాచారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా రైతు భరోసా ఊసే ఎత్తడం లేదని పాల్వంచ మండల శాఖ భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు తోట సాయులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికైనా ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేతలు విఠల్ రావు, ఆనందరావు ఉన్నారు.



పాల్వంచ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నేతలు

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు శుక్రవారం ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 11 వరకు కరీంనగర్‌లో జరిగే నెట్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రాకేష్, 7వ తరగతి విద్యార్థులు రూప, విఘ్నేష్‌లు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో రాజగంగారెడ్డి అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట విద్యార్థిని

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మదిరే అశ్విత అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రామ్ మనోహర్ తెలిపారు.

గోపాల్‌పేట్ హైస్కూల్ విద్యార్థిని..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట హైస్కూల్‌కు చెందిన మౌనిక అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి 71వ సీనియర్ ఉమెన్స్ కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీడీ సభాత్ కృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మౌనిక గురువారం కామారెడ్డిలో జరిగిన జిల్లా సీనియర్ ఉమెన్స్ కబడ్డీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిందని ఆయన చెప్పారు. ఈ నెల 08న హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్స్ కబడ్డీ పోటీలలో మౌనిక పాల్గొనున్నట్లు ఆయన వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత, పీడీ సభాత్ కృష్ణ, మౌనికను అభినందించారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో బైక్‌పై నుంచి పడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలంలోని పోచమ్మరాల్ తండాకు చెందిన రమావత్ దేవీసింగ్ తన బైక్‌పై మెగావత్ విఠల్(46)ను ఎక్కించుకుని అతివేగంగా బైక్ నడుపుతుండగా ఆటోను ఢీకొనడంతో బైక్‌పై వెనక కూర్చున్న విఠల్ కింద పడడంతో తలకు తీవ్రగాయాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



విఠల్ మృతదేహం

విద్యుదాఘాతంతో మరొకరు..

ఎల్లారెడ్డి: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని సాతెల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మి(35) ఇంటికి సర్వీస్ వైర్‌కు సంబంధించిన తీగలు తలుపునకు ఆనుకొని ఉండడంతో విద్యుదాఘాతం సంభవించి లక్ష్మి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



లక్ష్మి మృతదేహం

యువకుడిపై పోక్సో కేసు

బోధన్‌రూరల్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన వినయ్ అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తప్పిపోయిన పిల్లలు దొరికారు

ఖలీల్‌వాడి: నగరంలోని హష్మీ కాలనీకి చెందిన ముగ్గురు పిల్లలు ఉదయం కిరాణషాపునకు వెళ్లి తప్పిపోయారని తిరిగి సాయంత్రం దొరికినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఉదయం నగరంలోని హష్మీకాలనీకి చెందిన మహమ్మద్ బిలాల్, అయేషా ఫాతిమా, మహమ్మద్ అలీ అనే ఆరేళ్ల లోపు పిల్లలు కిరాణ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల ద్వారా పిల్లల ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్‌లో 14 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై మొగిలయ్య శుక్రవా రం పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదేశాల మేరకు సెల్‌ఫోన్‌లకు అందించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు సెల్‌ఫోన్ గుర్తించి అందిస్తామని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమిలో వేసిన బోరు సీజ్



నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూర్ శివారులో ఉన్న శిఖంభూమిలో వేసిన బోరును రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. దీంతో పాటు బోరుకు ఏర్పాటు చేసిన కరెంట్ కనెక్షన్‌ను సైతం ట్రాన్స్‌కో సిబ్బంది సాయంతో తొలగించారు. ఆత్మకూర్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గతంలో గ్రామ శివారులోని శిఖం భూమిలో బోరు వేశారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు సర్వే చేపట్టి బోరు శిఖం భూమిలో ఉన్నట్లు తేల్చారు. దీంతో నాగిరెడ్డిపేట ఆర్ఐ మహ్మద్, ట్రాన్స్‌కో లైన్‌మన్ కరుణాకర్ శిఖం భూమిలో ఉన్న బోరు వద్దకు చేరుకొని దానిని సీజ్ చేశారు. దీంతో పాటు సదరు బోరుకు ఉన్న కరెంట్ కనెక్షన్‌ను తొలగించారు.

ఆలయంలో చోరీ

నిజామాబాద్ రూరల్: ముబారక్‌నగర్ శివారులో ఉ న్న మహాలక్ష్మి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆలయంలో రోజువారిలాగే అర్చకులు గురువారం రాత్రి పూజలు చేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపరిచే మహిళ వచ్చి చూడగా హుండీ తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలో అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవను మరువలేమని అన్నారు.

నర్సింగ్ కోర్సుకు మంచి భవిష్యత్

బాన్సువాడ రూరల్: నర్సింగ్ విద్యకు దేశంలోనే కాదు విదేశాల్లోనూ మంచి భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో కొనసాగుతున్న నూతన నర్సింగ్ కళాశాలను ఆయన సందర్శించారు. మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులతో మాట్లాడారు. వారికోసం ప్రత్యేకంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. నాయకులు కాసుల బాలరాజు, ఎర్వాల కృష్ణారెడ్డి, ఎజాస్, పిట్ల శ్రీధర్, మోహన్ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్

అంబేడ్కర్ అడుగుజాడల్లో మోదీ పాలన

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి క్రైం: అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర వెలకట్టలేనిదన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి క్రైం: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌లలో ఉన్న సౌకర్యాలు, రోడ్లు, మురికి కాలువలు లాంటి మౌలిక సదుపాయాలను శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ.. లేఅవుట్‌లలో ఎక్కడ, ఎలాంటి అవతవకలు జరిగినా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేవునిపల్లి పరిధిలో హైటెన్షన్ వైర్ల కింద 83 ఫీట్ల రోడ్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. టీపీవో గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

'లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి'

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కరం కోసం ఆయన సూచనలు ఇచ్చారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.నాగరాణి, ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, ఎస్పీ సింధు శర్మ, డీఎస్పీ నాగేశ్వరరావు, శ్రీనివాసులు, టి.సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్‌గౌడ్, శేషు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జువైనల్ బోర్డు ఏర్పాటు..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో జువైనల్ బోర్డును ఏర్పాటైనందుకు సంతోషంగా ఉందని జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాల రక్షా భవన్‌లో జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంతో విభేదించబడిన పిల్లలకు జువైనల్ బోర్డు ద్వారా న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం, డీసీపీవో స్రవంతి, అధికారులు స్వర్ణలత, రమణ, బాలరక్ష భవన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

శాంతి భద్రతలు కాపాడటంలో హోంగార్డుల పాత్ర కీలకం

కామారెడ్డి క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర కీలకమని ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం హోంగార్డ్ రైసింగ్ డే వేడుకల్లో ఏఆర్ డీఎస్పీ యాకుబ్ రెడ్డి పాల్గొని హోంగార్డులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించినందుకు పలువురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ఏఆర్ డీఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమానికి జిల్లా ఎస్పీ సూచనలు, సలహాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు మహేష్, చంద్రశేఖర్, హోంగార్డులు పాల్గొన్నారు .



ప్రశంసా పత్రాలు అందుకున్న హోంగార్డులతో ఏఆర్ డీఎస్పీ యాకుబ్‌రెడ్డి

వైకల్యం శరీరానికే మనసుకు కాదు




నిజాంసాగర్‌లో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో తిరుపతిరెడ్డి




పిట్లంలో బహుమతులను అందజేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ప్రమోద్ కుమార్

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో పలు చోట్ల శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ..అంగవైకల్యం శరీరానికి మాత్రమే మనసుకు కాదన్నారు. మంచిగా చదువుకుంటే భవిష్యత్తులో గొప్పవారవుతారని అన్నారు. దివ్యాంగులైన లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్ హాకింగ్, హెలెన్ కెల్లర్ లాంటివారు ఎన్నో అద్భుతాలు సృష్టించారని గుర్తు చేశారు.



లింగంపేటలో మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్‌అలీ



సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజిరెడ్డి

ముగిసిన బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గల గోవిందమాంబ సమేత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. సంఘం ప్రతినిధులు వడ్ల మహేశ్ చారి, ముత్యం రాజు చారి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి జెండాకు పూజలు

భిక్కనూరు: మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి జెండాకు భక్తులు శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. జెండాకు ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యాలను సమర్పించి కట్నకానుకలను సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రుద్రూర్: భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు బోధన్ మెజిస్ట్రేట్ కె రవికుమార్ తీర్పు వెల్లడించారని కోటగిరి ఎస్సై సందీప్ పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. పోతంగల్ మండలం కొల్లూర్‌లో 2022సెప్టెంబర్14న నిమ్మల అంజని హత్యకు గురైంది. అంజనిని భర్త నిమ్మల పోశెట్టి హత్య చేసినట్లు కుమార్తె ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై రాము కేసు నమోదు చేయగా, సీఐ జాన్‌రెడ్డి చార్జిషీట్ వేశారు. బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావ్ వాదనలు వినిపించారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడు పోశెట్టికి జీవిత ఖైదు, రూ. వెయ్యి జరిమానాను న్యాయమూర్తి విధించారు. జరిమానా చెల్లించకుంటే ఏడాది కఠిన కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారని ఎస్సై పేర్కొన్నారు.